

# మందిరంలో ఏకాకి

## కెన్యాకథ

మూలం: లూసీ మాథోనీ మూయిరూరీ:
అనువాదం: కలేకూరి ప్రసాద్

ఆమెను కలిశాను.

పదేళ్ళ క్రితం చూసినప్పటికీ యిప్పటికీ ఎంత మార్పు! బయటికి ఎంతో ప్రశాంతంగా నిమ్మళంగా వున్నట్లు కన్పించాలని ప్రయత్నం చేస్తోంది కానీ ఆమె అంతరంగాన చెలరేగుతున్న అలజడీ, ఆందోళన, ఏమీ చెయ్యలేని నిస్సహాయపుస్థితీ తెలుస్తోనే వున్నాయి.

నేనూ, డోరతీ హైస్కూలు దాకా ఒకే తరగతిలో కలిసి చదూకొన్నాం. మా హైస్కూల్ చదువు పూర్తవుతుండగా తను అమ్మగార్లలో కలసిపోవాలనుకొంటున్నాననీ సన్యాసం పుచ్చుకొని జీవితాంతం సిస్టర్‌గా ప్రభువు సేవకు అంకితమవ్వాలనీ అనుకొంటున్నానని చెప్పింది. మేమంతా తెగ ఆశ్చర్యపోయామప్పుడు.

ఆ తర్వాత ఆమె ఏమైందో తెలియదు. మళ్ళీ యిప్పుడు పదేళ్ళ తర్వాత ఆమెను యిలా యీ పట్టణంలో కలసుకోగలిగాను.

ఆమె విసిగిపోయింది. ఆమె అలసిపోయింది. తన గుండెల్లో గూడుకట్టుకొన్న విషాదాన్నంతటినీ ఎవరికైనా మనస్సువిప్పి చెప్పకోవాలనీ కడుపులో వున్నదంతా కక్కేయాలనీ ఆరాట పడుతోంది. ప్రేమగా సానుభూతిగా తన బాధల గాథల్ని,వినే ఒక్క హృదయం కోసం ఆమె తపించిపోతోంది. యింత కాలం తనే ఒంటరిగా అంతటినీ జీర్ణంచేసుకోవాలని విఫలప్రయత్నాలు చేసింది. ఎవరికీ చెప్పకోనూ లేక తనలో దాచుకోనూ. లేక ఆమె నరక యాతన అనుభవించింది.

మేమిద్దరం మాట్లాడుకోడం మొదలు పెట్టిన మరుక్షణంలోనే తన విషయాలన్నింటినీ నాతో చెప్పడం మొదలు పెట్టింది. బహుశా తన బాధను పంచుకోగలిగిన మనిషి దొరికినట్లుగా అనిపించేదేమో. జనం తనపైన పుట్టించిన పుకార్లు తన నెంతగా కుమలబొడుస్తున్నాయో చెప్పింది. తను అంకితమైన చర్చీ, సంఘమూ తనను తిరస్కరించిన అవమానం నుండి తేరుకోకముందే, ఆ తిరస్కృత ఛీత్కారాలను వదిలించుకోడానికి పెనుగులాడుతుండగానే జనం ఆమెను గురించి పుట్టెడు అబద్ధాలు సృష్టించారు. పలుమాటలతో కుళ్ళ పొడిచారు. తను అపవిత్రురాలనీ, చెడిపోయిందనీ అందుకే మతాన్ని వదిలివేసిందనీ ఒక ఫాదర్‌ని ఉంచుకొందనీ, అతన్ని పెళ్ళి చేసుకోబోతోందనీ రకరకాల పుకార్లు. ఒక్క తీరుగా కాదు. రోజుకి కాసిన్ని కతల్ని కనిపెట్టడం ప్రచారం చెయ్యడం. యీ తతంగమంతటితో డోరతి బలంగా గాయపడింది.

ఆమె చెప్తున్న దంతా ఓపిగ్గా, వింటున్నాను. నాలో సవాలక్ష సందేహాలు. మఠంలో జీవితం ఎలా వుంటుంది. అసలు డోరతి ఎందుకు? సన్యాసం తీసుకొన్నది. ఎందుకు దాన్ని వదిలేసి వచ్చింది. రకరకాల ప్రశ్నలు నా మెదడుని తొలిచేస్తుంటే అగలేక ఆమెనే అడిగేశాను. అసలే గాయపడిన మనిషి. అసలే బాధాతప్త హృదయంతో గోజాడుతున్న మనిషి కుమిలి కుమిలి పోతున్న మనిషి. యీ ప్రశ్నల్ని అడిగితే ఆమె మరింత గాయపడుతుందేమోనన్న భయసందేహాలు నన్ను పీడిస్తూనే ఉండినాయి. అయినా అడిగేశాను. నేను అడిగిందే తడవుగా ఆమె మాట్లాడడం మొదలు పెట్టింది. కాలువకి లాకులు ఎత్తేస్తే నీళ్ళు ఎంత పురవడితో తన్నుకు వస్తాయో అంత ఉధృతితో ఆమె లోపలి ఆవేదనంతా పెల్లుబికి వచ్చింది.

"నేను కాన్వెంట్‌లో సిస్టర్‌గా చేరినప్పుడు ప్రభువుని గురించి మరింత ఎక్కువగా తెలుసుకొనే వీలు కలుగుతుందనీ, నా జీవితాన్ని ప్రభువు సేవకు అంకితం చేయవచ్చనీ, అనుకొన్నాను. యిహలోకపు బంధనాలన్నింటినీ తెగ తెంచుకొని దైవికమైన విషయాలపైనే మనస్సును లగ్నం చేయవచ్చనీ అనుకొన్నాను. అందుకోసం నా శక్తి వంచన లేకుండా ప్రయత్నం చేశాను. కానీ నానుండి నేను దూరం కాలేకపోయినాను. నా ఆడతనపు అనుభూతుల్ని నేటినీ నేను వదుల్చుకోలేకపోయినాను. యీ విషయం నాకు మొదట్లోనే తెలిసివచ్చింది..."

"ఆడతనపు అనుభూతులంటే ...?" ఆసక్తిగా అడిగాను.

"యిరవై ఏళ్ళ వయస్సులో నేను యిల్లు వదిలి వచ్చేశాను. బళ్ళో చదూకొనే రోజుల్లో నేనెలాంటిదాన్నో, ఎలా వుండేదాన్నో నీకూ తెలుసు. ఏనాడూ మగపిల్లల ధ్యాస కానీ, వాళ్ళ వూసుగానీ వుండేది కాదు. వాళ్ళతో తిరగాలనీ, ప్రేమించాలనీ ఎన్నడూ నేను అనుకోలేదు. ఆ సంగతులన్నింటినీ యిప్పడాలోచిస్తోంటే ... నేను నా కోరికలన్నింటినీ బలవంతంగా అణిచి పెట్టి వుంచానేమో అనిపిస్తోంది.

నేను సన్యాసం పుచ్చుకొని సిస్టర్ నయ్యాను. యిరవై మూడేళ్ళ వయస్సులో నాలో సెక్స్ కోరికలు బలంగా కలగడం మొదలు పెట్టాయి.

ఎందుకిలా జరుగుతుంది. ఎవరికైనా చెప్పకోవాలనిపించింది. ఎవరికి చెప్పాలి? ఏమని చెప్పాలి? మనసు విప్పి చెప్పకోడానికి సన్నిహితమైన మనిషి ఒక్కరైనా లేరు. ఎవరికైనా చెప్పకొంటే ఏమంటారు. చెప్పే చెప్పగానే వాటినన్నింటినీ నా అంతః చేతనా



పారల్లో సమాధి చేస్తారు. ఒక రాత్రి ... నాకు బాగా జ్ఞాపకముంది. నరకాన్ని చవి చూశాను. నన్ను ఎవరైనా దగ్గరకు తీసుకొంటే బాగుండుననీ గుండెలకు హత్తుకుంటే బాగుండుననీ మనస్సూ తనువూ తహతహలాడాయి. ఏం చెయ్యనూ! కనీసం ఎవరికైనా చెప్పకోకపోతే యీ అగ్నిచల్లారదు. మా మదర్ సుపీరియర్‌కి చెబ్దామనుకొన్నాను. ఆమె మాకు అండదండా మెలమెల్లగా ధైర్యాన్ని కూడగట్టుకొని ఆమె దగ్గరకు వెళ్ళాను. వెళ్ళడమైతే వెళ్ళాను గానీ ఆమెతో చెప్పకోవడం ఎలా! భయం... సందేహం... నా సంక్షోభాన్ని ఆమెకు చెప్పకోడానికి ఎంతగా గింజాటన పడ్డానో నేనెప్పటికీ మర్చిపోలేను. ఎందుకింతగా కోరికలు చెలరే గుతున్నాయి. నేను ప్రభువు సేవకు పనికిరానా? నా నిబద్ధతా, నా అంకిత హృదయం, నా శిక్షణ ఎందుకూ కొరగాకుండా పోతాయా? నాలో ఏమన్నా పాపముందా రకరకాల భావాలు గుండెను కోసేస్తున్నాయి. మనిషై పుట్టిన ప్రతి ఒక్కరికీ యిలాగే వుంటుందా? సెక్స్ కోరికలు చంపుకు తింటాయా? యిలాంటప్పుడు ఏం చెయ్యాలి? నాకెవరూ ఎప్పుడూ ఏమీ చెప్పలేదేం? ... మా మదర్ సుపీరియర్ నా గోడంతటినీ ఓపిగ్గా విన్నది. "మరేం పర్లేదు. నీ శిక్షణలో ఏ లోపమూ లేదు. మొత్తం మర్చిపోయి హాయిగా నిద్రపోడానికి ప్రయత్నం చెయ్యి... అంతా అదే సర్దుకొంటుంది" అని చెప్పింది. నేను నా గదికి వచ్చేశాను. కానీ ఆమె చెప్పినట్లు అంతా అదే ఏం సర్దుకోలేదు. ఆ నిద్రపట్టని రాత్రిలో ఎంత ఏడ్చానో ... ఎంత తన్నుకలాడానో ... నేను మర్చిపోలేను."

డోరతీ తన సిస్టర్ ట్రైనింగ్ కాలమంతా ఎంత ఘర్షణగా గుర్రైందీ చెప్తోంది. యీ సమస్యతో పాటు మరొక పెద్ద సమస్య. తనకు బహిష్టు సమయంలో భరించలేని నొప్పి వస్తుండేదని చెప్పింది.

"ఒక రోజు నేను చర్చిని శుభ్రం చేస్తున్నాను. అకస్మాత్తుగా పొత్తి కడుపులో సూదులుతో పొడుస్తున్నట్లుగా భయంకరంగా నొప్పి. బాధతో, భయంతో వణికిపోయాను. అతికష్టం మీద పళ్ళ బిగువున బాధను భరిస్తూ యీడ్చుకొంటూ నా గదికి చేరి పడుకుండిపోయాను. రెండు గంటల పాటు అలాగే వేదనతో కొట్టు మిట్టాడాను. ఉన్నట్టుండి మా మదర్ సుపీరియర్ వస్తున్న సవ్వడి వినిపించింది.

ఆమె వస్తూనే "ఏమైంది డోరతీ .. . ఏమైంది నీకు ... ఎందుకు పడుకొన్నావు" అంటూ టక టకా ప్రశ్నల వర్షం కురిపించింది. ఆ ఆతృతలో నాకేమైందన్న ఆసక్తి లేదు. అర్ధాంతరంగా పని వదిలేసి వచ్చినందుకు కోపం ధ్వనించిందామె గొంతులో". తనకు ఎంత బాధగా వుందో వివరించడానికి ప్రయత్నించింది డోరతి. కనీసం సానుభూతి చూపించక పోగా రెండు గంటల సేపు క్లాసు పీకి వెళ్లిందామె. మరీ అంత బాధపడకూడదంట. మరీ అంత బలహీనంగా ఉండకూడదంట.

"లేచి వెళ్ళి నీ పని చూసుకో ... ఫో" అంటూ ఆర్డర్ జారీ చేసి వెళ్ళిపోయిందామె. డోరతి యింక చేసేదేమీ లేక నీరసంగా, బాధగా చర్చి ఊడ్చడానికి వెళ్ళింది.

"నాకులాగే ఆమె కూడా ఆడదే కదా... కనీసపు సానుభూతైనా ఏమాత్రం లేకుండా ఆమె యీ విధంగా ఎలా మాట్లాడగలుగుతోంది ...!" డోరతి మనస్సు తల్లడిల్లిపోయింది. ఆమె చుట్టూ అందరూ స్త్రీలే. అందరూ తనలాగే సన్యాసం పుచ్చుకున్న వాళ్ళే. అంతా వున్నప్పటికీ ఆమె ఒంటరితనంలో మగ్గిపోయింది. తనిక సిస్టర్‌గా కొనసాగలేనేమోనన్న బాధ ఆమెను కలిచివేసింది.

"ఎవరూ ఏమి చెప్పరు. మనస్సు విప్పి మాట్లాడరు. బతుకంతా ఒంటరితనంలోనే గడుపుతున్నాననిపించింది" డోరతి గుండె బాధగా మూలిగింది.

ఆ తర్వాత పై చదువుల కోసం ఆమె విదేశాలకు వెళ్ళింది. రుతుస్రావ కాలమంతా నరకయాతనలతో పలువు తెంవుల గింజాటనా దృశ్యమయ్యింది డోరతి. ఆ నొప్పితో తనిక బతకనేమో అనుకొన్నది.

"ఒకసారి ఏదో విషయంలో డాక్టర్ని కలవాల్సి వచ్చింది. డాక్టర్ నన్ను పరీక్ష చేసి నా గర్భకోశంలో నరాలూ, మాంసం పేరుకుపోయ్యాయనీ వెంటనే హిస్టెక్టమీ ఆపరేషన్ చేసి గర్భసంచి తీసివేయాలనీ చెప్పారు. ముందే సరైన ట్రీట్‌మెంట్ తీసుకొని వుంటే యీ ఆపరేషన్ అవసరమే వుండేది కాదనీ అంతా నవ్యంగానే వుండేదనీ డాక్టర్ చెప్పారు. అప్పుడు నేనెంతగా తల్లడిల్లిపోయానో నువ్వు వూహించగలవా? నాకు నొప్పి తెలిసినప్పుడే నేను ఆస్పత్రికి వెళ్ళి వుండాల్సి వుంది. కానీ అప్పుడు బాధపడకూడదనీ ... బలహీనంగా వుండరాదనీ క్లాసులు వింటూ కూర్చున్నాను. ఎవరిని నిందించను. ఏ స్త్రీ అయినా తన శరీరంలో ముఖ్యమైన భాగాన్ని కోల్పోవలసి వచ్చినప్పుడు ... తన వ్యక్తిత్వానికి కీలకమైన అంగాన్ని పోగొట్టుకోవలసి వచ్చినప్పుడు తట్టుకొని నిలబడాలంటే ఎంత ధైర్యం కావాలి? నిజంగా కలలన్నీ కరిగిపోయాయి... కల్లలైనాయి..."

ఆమె ముఖంలోకి చూశాను. ఇంకా ఇంకా ఏదో చెప్పాలని ఆత్రపడుతోంది.

"నువ్వు అక్కడ ఎవరినైనా ప్రేమించావా" అనడిగాను.

"ఎట్లా వూహించావు ... నేనదే విషయం చెప్పబోతున్నాను. విదేశాల్లో వున్నప్పుడు నేనొక నైజీరియా ఫాదర్‌ని ప్రేమించాను. అక్కడ మన నల్లజాతి వాళ్ళు కొద్దిమందే వున్నారు. అందరం ఒకదగ్గరే కలిసికట్టుగా వుండే వాళ్ళం. ఆ నైజీరియా ఫాదర్ మా కాన్వెంట్‌కి ఆ మధ్య కార్యక్రమాన్ని నిర్వహించడానికి వచ్చేవాడు. అతనంటే నాకు యిష్టం ఏర్పడింది. యీ విషయాన్ని చాలా తొందరగానే నేను గ్రహించాను. అతను నాకు బాగా కావాలనిపిస్తోంది. ఏం చెయ్యాలో నా కర్థం కాలేదు. నా తోటి సిస్టర్స్‌కి యీ విషయం చెప్పాలా వద్దా. లక్ష సందేహాలు. చెపితే వాళ్ళేం చేస్తారు. ఎవరికీ ఏం చెప్పొద్దులే అనుకొన్నాను. ఎవరికీ చెప్పకోలేకపోవడంతో గుండె మరింత బరువెక్కేది. ఆయన పూజా కార్యక్రమం నిర్వహించేటప్పుడు నేనలాగే అతనివైపే చూస్తుండేదాన్ని. ఆయన సత్ప్రసాదాన్ని పంచిపెట్టడం కోసం రొట్టె ముక్కల్నీ ద్రాక్ష రసాన్ని పైకెత్తి పట్టుకొన్నప్పుడు నేనక్కడే కూర్చొని వుండేదాన్ని. నాలో చెలరేగుతోన్న భావాలన్నింటినీ అతనితో చెప్పేయాలనిపించింది. తనని గాఢంగా గుండెలకి హత్తకోవాలనిపించేది. కానీ ఏమీ చెప్పలేకపోయేదాన్ని. యిక రాత్రి నిద్ర కోసం తన్నకలాడేదాన్ని. నిద్ర రాదు. అతనితో యేమీ చెప్పలేక, కోరికల్ని అణుచుకోలేక సతమతమయేదాన్ని. యీ కాలంలోనే నేను స్వయంతృప్తి కి అలవాటుపడ్డాను. అదొక్కటే నాకు ఒక్కగానొక్క మార్గంగా తోచింది. అయితే ఒక సన్యాసినిగా స్వయం తృప్తి పద్ధతులను అనుసరించడం కూడా పాపమేనని నేను విశ్వసించాను. ప్రతిసారీ ఒంటరిగా నన్ను నేను తృప్తి పరుచుకొనే ప్రయత్నం చేయడం ప్రతిసారీ ఏదో పాపం చేస్తున్న భావనతో కుంగిపోవడం. యిలా కొన్ని నెలలు గడిచిపోయాయి. కొంత కాలానికి నన్ను అర్థం చేసుకోగలిగిన నాతోటి సిస్టర్ ఒకామె పరిచయమైంది. ఆమె కూడా యిన్వనంలో వుంది. కనీసం నా లోలోపల బద్దలవుతోన్న అగ్నిపర్వతాల గురించి చెప్పకోడానికి ఒక మనిషి దొరికింది. ఆమె నన్ను సముదాయించడానికి ఎంతగానో ప్రయత్నించింది కానీ ఏం లాభంలేకపోయింది."

"నువ్వు సిస్టర్ జీవితాన్ని వదిలివేయడానికి కారణాలు యివేనా ...?" అనడిగాను.

"యివే అని చెప్పలేను. అన్నీ ఒకదానికొకటి తోడయ్యాయి. యింత పెనుగులాటలోనూ నా ప్రభువును చేరుకోవాలనీ, ఆయనతో మాట్లాడాలనీ ఎంతగానో ప్రయాసపడ్డాను. నేను సిస్టర్‌గా కొనసాగినంత కాలమూ నా ప్రభువుని నా నిజమైన సహచరుడిగా తెలుసుకోవాలనీ, ఆయన నన్ను కన్నతండ్రిలాగా నడిపించాలనీ ఎంతో తపనపడ్డాను. యీ కాలమంతా ఎంతగానో మానసిక క్షోభను అనుభవించాను. ఎన్నో నెలల పాటు ... నాలో నేను పోరాడిన తర్వాత చివరకు ప్రభువుతో మాట్లాడాను. ఆయన్ని నేను తెలుసుకొన్నాను. ఆయన నా దైవం. నా రక్షకుడు. నా ప్రభువు నాకు తెలిసిందానికీ సన్యాసినులుగా మేం ఆశించిన దానికీ సంబంధమే లేదని నాకనిపించింది. ఆ విషయమే అందరితో గొడవపడ్డాను. ఆఖరికి నన్ను బయటకు వెళ్ళి రమ్మన్నారు. నా ప్రశ్నలు మఠాధిపతులెవ్వరికీ మింగుడుపడలేదు."

"యిప్పుడు పదేళ్ళపాటు మఠం గోడల వెనక మగ్గీ మగ్గీ బయటకు వచ్చినతర్వాత లోకమంతా ఎంతో పరాయిగా కన్పిస్తుంది. లోపలున్నంత కాలం నాలాంటి జీవితాన్నే అనుభవిస్తోన్న సన్యాసినుల సమూహంలో ఒంటరిగా గడిపాను. ఎవరూ ఎవరికీ ఏమి కారు. ఒకళ్ళ అంతరంగాన్ని తవ్వి తలకెత్తుకొనే వారెవరూ లేరు. ఎవరూ ఎవరికీ ఏమీ చెప్పకోరు. యిప్పుడు బయటికి వచ్చాను. అంతా వింతగా కొత్తగా కన్పిస్తోన్న ప్రపంచంలో నన్ను నేను ఆవిష్కరించుకోడానికి పెనుగులాడుతున్నాను.

(కెన్యా స్త్రీ రచయితల కవితా, కథా సంకలనం OUR SECRET LIVES నుండి)

వచ్చే వారం
ఒక దెయ్యం కథ
-అనామక్